ప్రగతి పథంలో పల్లెలు

- ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు
- నెరవేరుతున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ, పైపులైన్ సమస్యలు
- అభివృద్ధి పనులపై ప్రజల హర్షం


చిన్నపెండేకల్‌లో పూర్తయిన సీసీ రోడ్డు


ధణాపురంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం (ఫైల్)

ఇది కదా అభివృద్ధి

ఆదోని రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తోంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే గాకుండా గ్రామాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై, వారి సమస్యలపై ఆరా తీయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి కూడా పథకాలు అందేలా చూడాలని, అలాగే గ్రామాల్లో అభివృద్ధి, ఇతర సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని సీఎం ఆదేశాలు ఉన్నాయి. ఈ మేరకు ప్రతి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నిశాఖల అధికారులతో కలిసి గ్రామాల్లో తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

ఆదోని మండలంలో 44 గ్రామాలు, 35 సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం 18 సచివాలయాల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయ్యింది. గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసింది.

ముమ్మరంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం

సచివాలయాలకు మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర సమస్యలు, పైపులైన్ల సమస్యలు పరిష్కరించబడ్డాయి. ఇప్పటివరకు చిన్నపెండేకల్, పెద్దపెండేకల్, ధణాపురం, బైచిగేరి, విరుపాపురం, బసరకోడు, అలసందగుత్తి, జాలిమంచి నాగనాథనహల్లి, కపటి, సుల్తానపురం, గణేకల్ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేశారు.

ఎన్నో అవస్థలు పడ్డాం



గత కొన్నేళ్లుగా మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేక అవస్థలు పడ్డాం. వర్షం వస్తే ఇళ్ల ముందు మోకాలి లోతు వరకు నీరు నిల్వ ఉండేవి. కాలు మోపడానికి కూడా ఇబ్బందులు పడ్డాం. వర్షపునీరు ఇళ్లలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఎమ్మెల్యే మా ఊరికి వచ్చి సమస్యను చూసి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువ సమస్య తీరింది.

– ఆంజనేయ, చిన్నపెండేకల్ గ్రామం

మురుగు కాలువలు ఏర్పాటు చేశారు



ఊరి చివరన ఉండే ఎస్సీ కాలనీ కావడంతో గత కొన్నేళ్లుగా సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేక ఇళ్ల ముందే మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లేది. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మా గ్రామానికి వచ్చి సమస్యను తెలుసుకుని తక్షణమే రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– నాగవేణి, ధణాపురం గ్రామస్తురాలు

పనులు పూర్తయ్యాయి



మా గ్రామంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో అధికారులు, ఎమ్మెల్యే పాల్గొని అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.30 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో కాలనీల్లో మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మహాదేవ, బైచిగేరి గ్రామ సర్పంచ్

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత



ఇప్పటివరకు 16 సచివాలయాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నాం. ప్రజలు లేవనెత్తిన సమస్యలను నోట్ చేసుకుని ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రస్తుతానికి 12 సచివాలయాల పరిధిలో పనులు పూర్తయ్యాయి. మరో ఐదు సచివాలయాల్లో త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– గీతావాణి, ఎంపీడీఓ, ఆదోని

క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు


క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదోనిఅర్బన్: మహాయోగి లక్ష్మమ్మ కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ రాయచోటి రామయ్య సహకారంతో రాయచోటి సుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం అవ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో 1 నుంచి 3వ తరగతి విద్యార్థులకు జనరల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అర్హత పరీక్ష ఆధారంగా పోటీలో పాల్గొనే వారి నుంచి ఐదుగురిని క్విజ్ నిర్వహణకర్త సి.ఆర్.ఎం.జి.రెడ్డి ఎంపిక చేశారు. పర్యవేక్షకులుగా అవ్వ బ్యాంకు మేనేజర్ జి.మురళీకుమార్, సంధానకర్తలుగా సి.భీమారెడ్డి, ఎం.కృష్ణ, జి.విష్ణువర్ధన్‌రెడ్డి, నవాజ్, సృజన్‌లు వ్యవహరించారు. ఉత్కంఠగా సాగిన పోటీలో మొదటి ఐదు స్థానాల్లో వరుసగా ఎం.విహాస్‌రెడ్డి, గౌతమ్‌కృష్ణ, జి.మునిమనోజ్, కె.ఎస్.మేఘశ్రీ, జి.అఖిల గెలుపొందారు. విద్యార్థుల్లో పోటీతత్వం, సృజనాత్మకతను వెలికి తీసేలా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఈఓ జి.మురళీకుమార్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

ఆదోనిఅర్బన్: చేతివృత్తులు చేసుకునే వారు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ వడ్రంగి, రజకులు, టైలర్లు, కుమ్మరులు, కమ్మరులు, బంగారు పనిచేసేవారు, క్షురకులు, తాపీ పనివారు, చెప్పులు తయారీదారులు, చర్మకారులు, ఇలా 16 రకాలైన వృత్తులవారు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న వారికి రోజుకు రూ.500 స్టైఫండ్‌తో 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చి పూర్తయిన తర్వాత రూ.15 వేలు విలువ గల సామగ్రిని ఉచితంగా అందజేసి, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణ సదుపాయాన్ని తక్కువ వడ్డీతో కల్పిస్తారని వివరించారు.

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు


కంబలదిన్ని గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల ఇళ్లలో వెలుగులు నిండాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కంబలదిన్ని గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి అవ్వాతాతలు, అక్కా చెల్లెమ్మలను కలిసి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ.. అవ్వాతాతలకు జనవరి నుంచి రూ.3 వేల పింఛన్ వస్తుందని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలతో పాటు మరెన్నో పథకాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ముక్కరన్న, చంద్రశేఖర్, విజయేంద్రరెడ్డి, రఘురాముడు, ఎంపీడీఓ ప్రభాకర్, ఆర్‌ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


చెట్నిహళ్లిలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మంత్రాలయం: మండల పరిధిలోని చెట్నిహళ్లి గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు ప్రియాంక భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన రూ.3 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రతి పల్లె ప్రగతి బాట పట్టిందన్నారు. మండల కన్వీనర్ భీమారెడ్డి, సర్పంచ్ అంజి, ఉప సర్పంచ్ వీరనాగప్ప, ఎంపీటీసీ సభ్యుడు రామాంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆరోపించారు. శుక్రవారం కళాశాల ఆవరణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం స్పందించి విద్యార్థులకు కనీస వసతులు, తాగునీరు, బాత్‌రూమ్స్ వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు బాలు, దేవేంద్ర, తరుణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం


రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్ తదితరులు

ఆదోనిటౌన్: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయా కాలనీల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో చర్యలు తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 33వ వార్డు బొబ్బలమ్మగుడి, మరాఠీగేరిలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టు పనులకు భూమిపూజ చేశారు. సచివాలయాలకు మంజూరైన నిధులతోనే అభివృద్ధి పనులు చేపడుతన్నామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ శ్రేణులు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. కౌన్సిలర్ పద్మావతి, నాయకులు జైపాల్, కిషోర్, మమ్మత్తుస్వామి, రవి, దస్తగిరి, ఎంఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణానికి చెందిన టి.కంబిరెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడు టి.వి.శంకర్ రెడ్డి జిల్లా అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు తాలుకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టారమేష్ తెలిపారు. శుక్రవారం భీమాస్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థి శంకర్‌రెడ్డిని అభినందించారు. వారు మాట్లాడుతూ జనవరి 3 నుంచి 16వ తేదీ వరకు వెంకటగిరిలో జరిగే క్రీడల్లో బ్యాటర్‌గా శంకర్‌రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. తాలుకా అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ ముజీబ్, కార్యదర్శి వెంకటేశ్, జాయింట్ కార్యదర్శి కంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే


కౌతాళంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కౌతాళం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కౌతాళం సచివాలయం–2 పరిధిలో కాచాపురం సర్పంచ్ వై.జయమ్మ, మహిళా నాయకురాలు వై.ప్రియాంకతో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి గ్రామస్తులకు మంజూరైన సంక్షేమ పథకాలు వివరిస్తూ కాలనీ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న దేశంలోనే ఆదర్శంగా పాలన సాగిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, విద్యా కానుక, వైఎస్సార్ ఆసరా, జగనన్న చేయూత పథకాలతో పేదల లోగిళ్లలో వెలుగు తెచ్చారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో నవరత్నాల పథకాలే తమ విజయానికి సోపానాలుగా మారుతాయన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఎన్ని ఎత్తులు వేసినా చిత్తు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్ దినకర్, వైస్ ఎంపీపీ రామలింగయ్యస్వామి, జేసీఎస్ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు దాట్ల సుబ్బరాజు, వడ్డెరాము, గురురాఘవేంద్రారెడ్డి, ఎంపీడీఓ సుబ్బరాజు, ట్రాన్స్‌కో ఏఈ నరసన్న, ఏఎస్‌ఐ నారాయణరెడ్డి పాల్గొన్నారు.


పైపులైన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన

మంత్రాలయం: మండల పరిధిలోని 52–బసాపురం ఎత్తిపోతల పథకం పనులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పరిశీలించారు. శుక్రవారం తుంగభద్ర-మంత్రాలయం రోడ్డులో పైపులైన్ కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో వర్షాధార మెట్ట భూములను ఆయకట్టుగా మార్చాలన్న ఉద్దేశంతో రూ.10.42 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు చేపట్టామన్నారు. గ్రామ పరిధిలో 1,455 ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఆరు ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను చేపట్టినట్లు వివరించారు. పనులు త్వరతగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉనికి కోసమే టీడీపీ తప్పుడు ఆరోపణలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ శాంత, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు

ఆదోనిటౌన్: రాజకీయ ఉనికి కోసమే టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, అధ్యక్షులు దేవా మండిపడ్డారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఆదోనిలో అభివృద్ధి జరగలేదని టీడీపీ నాయకులు ఉమ్మిసలీం, గుడిసె కృష్ణమ్మ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదోని అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు చంద్రబాబు దృష్టిలో పడేందుకు ప్రభుత్వం, వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడం భావ్యం కాదని వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, చంద్రకాంత్‌రెడ్డి హితవు పలికారు. నవరత్నాల పథకాలతో ఎంతో మంది పేదలకు మేలు జరిగిందని అలాంటి పథకాలు మోసపూరితమైనవని గుడిసె కృష్ణమ్మ ప్రచారం చేయడం ఎంతవరకు సబబు అన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ ఫయాజ్‌అహ్మద్, ఇబ్రహీం, సురేష్, నాయకులు అబ్దుల్‌రజక్, రామదాసు, హాజీబాషా తదితరులు ఉన్నారు.

వస్త్ర దుకాణంలో చోరీ

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణం బీఎస్ టాకీస్ సమీపంలోని ఎంఎం రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. షాపులో ఉంచిన రూ.లక్ష నగదును దోచుకెళ్లినట్లు యజమాని ఇక్బాల్ వాపోయారు. రోజు మాదిరిగానే రాత్రి షాపునకు తాళాలు వేసి వేశామని, శుక్రవారం కొందరికీ నగదు ఇవ్వాల్సి ఉండగా ఆ డబ్బు షాపులో ఉంచి వెళ్లామన్నారు. ఉదయం టీ తాగేందుకు వచ్చిన స్థానికులు దుకాణం షట్టర్ కొంతభాగం తెరిచి ఉండడాన్ని గమనించి యజమానికి సమాచారం అందించారు. ఆయన వచ్చి చూడగా దొంగలు దుకాణంలోని డబ్బు పెట్టెను పగులగొట్టి రూ.లక్ష దోచుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే ఆదోని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. షాపులో షాపు బయట ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించగా తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరు కాపలాగా ఉండగా ఒకరు లోపలికి వెళ్లి దొంగతనం చేసినట్లు నమోదైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


షట్టర్ తాళాలు పగలగొట్టిన దృశ్యం

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో రెండో రోజూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపను సందర్శిస్తూ ప్రజలతో మాట్లాడుతూ ముందుకు కదిలారు. ఉదయం 11:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 600 గృహాలను సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవరత్నాలు, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పెన్షన్ కానుక, రైతు భరోసా పథకాలు అందుతున్నాయా లేదా, మీ సమస్యలు ఏమిటి, ఇక్కడ మంచినీరు, వీధి దీపాలు, డ్రెయినేజీ, రోడ్లు తదితర సౌకర్యాల గురించి ఆరా తీశారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 600 హామీలిచ్చి నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశాడన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ నెరవేర్చి ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించాడన్నారు. అవినీతికి తావు లేకుండా గ్రామంలో వివిధ పథకాల ద్వారా రూ.27,33,46,000 నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. గ్రామంలో పేద ప్రజలకు జగనన్న కాలనీలో 303 ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. బీసీ, మైనార్టీ కాలనీల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్సీ కాలనీలో రూ.35 లక్షలతో సీసీ రోడ్లు, రూ.15 లక్షలతో తాగునీరు పైపులైన్ వేయడం జరిగిందన్నారు. సచివాలయం నిధులు రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచ్ ఉచ్చప్ప, బసవరాజ్, ఎంపీటీసీ లక్ష్మిశివరాజ్, మౌలా, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, శ్రీలక్ష్మి, ఎంపీపీ దానమ్మ, పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు


పెద్దహరివాణంలో వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఆదోని సెంట్రల్: ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మూడవ రోజు ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలతో సందడిగా మారింది. పట్టణంలోని 8 జట్లు గ్రామీణ ప్రాంతం నుంచి 8 జట్ల క్రీడాకారులు పోటీపడ్డారు. కో–ఆర్డినేటర్ నరసయ్య మైదానంలో మూడు చోట్ల క్రికెట్ పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆయా ప్రాంతాల క్రీడాకారుల కోలాహలంతో మంచి జోష్‌గా పోటీలు సాగాయి. పట్టణంలోని లేబర్ కాలనీలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఆర్‌ఆర్ లేబర్ కాలనీలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. కాలనీ వాసులు పోటీలను ఆసక్తిగా తిలకించారు. అలాగే సంతేకుడ్లూరు, పెద్దహరివాణం గ్రామాల్లో పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని చాత్తా చాటారు.

కోసిగి: కోసిగి మండలంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పీడీలు ఖలీల్ అహ్మద్, రాజారాంలు సమక్షంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సత్తా చాటుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆదోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

నిర్వాసితుల వివరాల సేకరణ

పత్తికొండ రూరల్: పత్తికొండలో రోడ్డు విస్తరణ నేపథ్యంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా భవనాలు, స్థలాలు కలిగిన 281 మంది నుంచి గురువారం అధికారులు వివరాలు నమోదు చేసుకున్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద 5 కౌంటర్లు ఏర్పాటుచేసి రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలు కోల్పోయే వారికి తగిన పరిహారం అందించేందుకు భూయజమాని డాక్యుమెంట్‌లు, ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతా తదితర వివరాలు, ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను తీసుకున్నారు. రోడ్డు విస్తరణ చేపడితే తమకు నష్టం కలుగుతుందని కొందరు కోర్టును ఆశ్రయించగా.. వివరాల సేకరణలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఆర్డీఓ నీలపు రామలక్ష్మి ఆదేశాల మేరకు ఎస్‌ఐ గోపాల్ పోలీసు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: కర్ణాటక మద్యం అక్రమంగా తరలించే వారిని పట్టుకుని జైలుకు పంపుతామని సెబ్ సీఐ హరికృష్ణ హెచ్చరించారు. ఆదోని పట్టణంలోని అమరావతినగర్ వద్ద బోయకుమార్ వద్ద 3 బాక్సులు, బోయ కాసమ్మ వద్ద ఒక బాక్సు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఎవరైనా కర్ణాటక మద్యం అమ్మినా, నిల్వ ఉంచినా, సరఫరా చేసినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కేసులు నమోదు చేసి జైలుపాలు చేస్తామన్నారు. ఎప్పటికప్పుడు కర్ణాటక మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు శివప్రసాద్, కర్నూలు డీటీఎఫ్ ఎస్‌ఐ స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌతాళం: అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యాన్ని కౌతాళం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఏఎస్‌ఐ సూర్యనారాయణ నేతృత్వంలో సాయంత్రం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో దాడులు చేపట్టారు. గ్రామానికి చెందిన చిన్న హనుమంతరెడ్డి ఇంట్లో కర్ణాటక మద్యం బాక్సులు (90ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ టెట్రాప్యాకెట్లు) దొరికాయి. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.